క్లుప్తంగా

భద్రతా చర్యలపై మాక్‌డ్రిల్‌

జి.కొండూరు: కట్టుబడిపాలెం హెచ్‌పీసీఎల్‌ ఆయిల్‌ కంపెనీలో భద్రతా చర్యలపై శుక్రవారం మాక్‌డ్రిల్‌ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్‌, గుంటూరు జిల్లాల డెప్యూటీ చీఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ ఫ్యాక్టరీస్‌ ఎంవీ శివకుమార్‌రెడ్డి, హెచ్‌పీసీఎల్‌ డీజీఎం కె. రమేష్‌బాబు హాజరయ్యారు. వీరి ఆధ్వర్యంలో జరిగిన మాక్‌డ్రిల్‌లో ఫైర్‌ యాక్సిడెంట్‌లు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గాయపడిన వారికి ప్రథమ చికిత్స, ఆస్పత్రులకు తరలించే విధానంపై అవగాహన కల్పించారు. కంపెనీలో భద్రతా చర్యలను పరిశీలించిన శివకుమార్‌రెడ్డి కంపెనీ అధికారులకు పలు సూచనలు చేశారు. హెచ్‌పీసీఎల్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై శిక్షణ

కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరురూరల్‌): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో కొమ్మిరెడ్డిపల్లిలో శుక్రవారం భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఏఓ పద్మ మాట్లాడుతూ పత్తి, మిర్చి పంటల్లో వేరుకుళ్లు, ఎండు, వడలు తెగుళ్లను అదుపులో ఉంచడానికి ట్రైకోడెర్మ విని యోగించాలని సూచించారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా భూసారానికి అనుగుణంగా పంటలను ఎంచుకోవచ్చని, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

తహసీల్దార్‌ బాధ్యతల స్వీకారం



గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్‌గా వి. రాజకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నిక విధుల్లో భాగంగా కాకినాడ జిల్లాలో పనిచేసిన ఆమె తిరిగి సొంత జిల్లా కేటాయింపుల్లో ఉన్నతాధికారులు గంపలగూడెం కేటాయించడంతో ఆమె వచ్చి చేరారు. ఎన్నికల సందర్భంగా గడచిన ఆరు నెలలుగా ఇక్కడ పనిచేసిన సుగుణ తూర్పు గోదావరి జిల్లాకు వెళ్లారు.

ప్రైవేట్‌ స్కూల్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా నరసింహారావు

తిరువూరు: ఏపీ ప్రైవేటు స్కూల్స్‌ అసోసియేషన్‌ తిరువూరు డివిజన్‌ అధ్యక్షుడిగా స్థానిక నాగార్జున స్కూల్‌ ప్రిన్సిపాల్‌ కె. నరసింహారావు ఎన్నికయ్యారు. తిరువూరు గీతమ్స్‌ స్కూల్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికలలో అసోసియేషన్‌ సభ్యులు ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకట్‌, కోశాధికారిగా సీతారామిరెడ్డి ఎన్నికయ్యారు.

దోమల నివారణకు చర్యలు

విస్సన్నపేట: పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్‌ చేయించామని సర్పంచ్‌ సాధుపాటి నాగమల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక సత్తుపల్లిరోడ్డులో దోమల నివారణ ఫాగింగ్‌ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ ఈఓ హరికృష్ణకుమార్‌, వార్డు సభ్యుడు నెక్కళపు కుటుంబరావు, దుర్గాప్రసాద్‌ పాల్గొన్నారు.

● **పెనుగొలను(గంపలగూడెం):** పెనుగొలనులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. సర్పంచ్‌ సంగెపు లలిత పర్యవేక్షణలో వీధుల వెంట ఫాగింగ్‌ చేశారు. సర్పంచ్‌ మాట్లాడుతూ మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

సారా విక్రేత అరెస్ట్‌

తిరువూరు: విస్సన్నపేట మండలం చంద్రుపట్లలో సారా విక్రయిస్తున్న దుర్గం వెంకటేశ్వరమ్మను 2 లీటర్ల సారాతో అదుపులోకి తీసుకున్నట్లు తిరువూరు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌ తెలిపారు. నిందితురాలిని విస్సన్నపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట బైండోవర్‌ చేశామన్నారు. గతంలో మద్యం అక్రమంగా విక్రయిస్తూ పట్టుబడిన దుబ్బాకు సంధ్యను తిరువూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట హాజరుపరిచామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ప్రసాద్‌

మైలవరం: మైలవరం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా చారుగుండ్ల ప్రసాద్‌, డైరెక్టర్‌గా జల్లి కృష్ణ నియమితులయ్యారు. మైలవరం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి నూతన కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. నూతనంగా నియమితులైన కమిటీ చైర్మన్‌ ప్రసాద్‌, డైరెక్టర్‌ జల్లి కృష్ణ తదితరులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ అభినందించారు.

డీపీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

ఆగిరిపల్లి: డీపీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అడవినెక్కలం, కనసానపల్లి, సీతారాంపురం, ఈదర, బొద్దనపల్లి సభ్యత్వ నమోదు చేశారు. మండల కార్యదర్శి వంశీ, నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డలకు శ్రేయస్కరం



కేతనకొండలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్‌ జహీదాబేగం :



గొల్లపల్లిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ ఎస్వై నూరాని, సర్పంచి వెంకటేశ్వరమ్మ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): తల్లిపాలు బిడ్డలకు శ్రేయస్కరమని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ జహీదా బేగం అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో కేతనకొండ క్లస్టర్‌లో శుక్రవారం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడంతో పాటు ప్రతి బిడ్డకు ఆరు నెలల పాటు తల్లి పాలు ఇవ్వాలని చెప్పారు. కొందరు తల్లులు పిల్లలకు పాలు ఇవ్వడం నామోషీగా చూడటం మానుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **నూజివీడు:** తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్‌ సీడీపీఓ ఎస్వై నూరానీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గొల్లపల్లిలో శుక్రవారం తల్లిపాల ఆవశ్యకతపై అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. ఆ తరువాత నుంచి తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలన్నారు. తల్లిపాలు బిడ్డలో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు దోహదపడుతుందని, భవిష్యత్‌లో వ్యాధులు రాకుండా తల్లిపాలు నిరోధిస్తాయన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతల గృహాలను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగేశ్వరి, సర్పంచి వెంకటేశ్వరమ్మ, సూపర్‌వైజర్‌ రమాదేవి, ఏఎన్‌ఎంలు పద్మ, ప్రిస్కిల్లా, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

● **నూజివీడు:** మండలంలోని అన్నవరం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సీడీపీఓ ఎస్వై నూరానీ, ఏసీడీపీఓ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● **గంపలగూడెం:** తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్‌ గంపలగూడెం సూపర్‌వైజర్‌ మునిలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా గంపలగూడెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముర్రుపాల పుట్టిన బిడ్డకు వెంటనే తప్పక పట్టాలన్నారు. డబ్బాపాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఏఎన్‌ఎంలు తిరుపతమ్మ, సరస్వతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● **మునునూరు:** ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం చింతలవల్లిలో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. సర్పంచ్‌ పిల్లి సత్యనారాయణ మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన సౌకర్యాలు

మంత్రి పార్థసారథి



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి: విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోగలరని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం నూతన పాఠ్య పుస్తకాల పంపిణీ చేశారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థులు ముందుగానే నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా చదువుకోవాలని సూచించారు. ప్రైవేట్‌ కళాశాలల కంటే ప్రభుత్వ కళాశాలల్లోనే ఎక్కువ సదుపాయాలు కల్పిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. డీవైఈఓ ప్రభాకర్‌, ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్‌ కుమార్‌, ప్రధానోపాధ్యాయుడు యోహాను పాల్గొన్నారు.

● **ఆగిరిపల్లి:** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలో సమగ్ర శిక్షలో పని చేస్తున్న సీఆర్పీలు శుక్రవారం ఆగిరిపల్లిలో మంత్రి పార్థ సారథికి వినతిపత్రం సమర్పించారు. సీఆర్పీలు రామారావు, బాజీ, సుభాషిణి, సుజాత పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి..

నూజివీడు: ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నాసిరకం భోజనం అందిస్తే చర్యలు తప్పవని మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను హెచ్చరించారు. నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కాలేజీ వసతి గృహాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట చేసే ప్రదేశాలు, టాయిలెట్స్‌, బాలికల విశ్రాంతి గదులను పరిశీలించారు. బాలికలు తాగునీరు, టాయిలెట్స్‌ శుభ్రత, విద్యుత్‌, భోజన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బాలికలకు కావలసిన ఫ్యాన్లు తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. త్వరలో బెడ్స్‌, టాయిలెట్స్‌, వంటశాల, శానిటేషన్‌, బిల్డింగుకు రంగులు, హాస్టల్‌ ఆవరణలో ఆహ్లాదకరమైన గార్డెన్‌, తాగు నీటి కోసం మినరల్‌ వాటర్‌ ప్లాంట్‌ ఏర్పాటు పూర్తి చేస్తామని బాలికలకు మంత్రి హామీ ఇచ్చారు.

● పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు శుక్రవారం మంత్రి కొలుసు పార్థసారథి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు చెరుకూరి దుర్గాప్రసాద్‌, కందుల సత్యనారాయణ, ప్రిన్సిపాల్‌ స్వర్ణలత పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి శంకర్‌ డిమాండ్‌



ఆందోళన చేస్తున్న దోనేపూడి శంకర్‌, నాయకులు

ఇబ్రహీంపట్నం: పరిశ్రమలు, క్వారీల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక రింగ్‌ సెంటర్‌లో ప్రమాదాల నివారణ చర్యలపై అలసత్వం వహిస్తున్న అధికారుల తీరుపై సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. శంకర్‌ మాట్లాడుతూ పరిశ్రమలు, క్వారీల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగడం వలన కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని విమర్శించారు. ఇటీవలి కాలంలో పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఎన్టీటీపీఎస్‌, పవన్‌ గ్రానైట్‌ మెటల్‌ క్వారీలో జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం జెలిటిన్‌ స్టిక్స్‌ ఇచ్చి కొండలు పగల కొట్టించడంతో కార్మికుల ప్రాణాలు బండరాళ్లల్లో నలిగిపోయాయని చెప్పారు. కార్మికులకు కనీస రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్‌ ఆఫ్‌ ఎంప్లాయీస్‌ కాంపన్సేషన్‌ ప్రకారం ఒక్కో కార్మికుడికి సుమారు రూ.17 లక్షల వరకు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అనధికార క్వారీలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ధ్వజమెత్తారు. ఎన్టీటీపీఎస్‌, కొండపల్లి ఐడీఏలో కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్‌ కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు, జిల్లా నాయకులు బుడ్డి రమేష్‌, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో సామాజిక న్యాయం

ఇబ్రహీంపట్నం: ఎన్నో ఏళ్ల పోరాటాలతో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు మారాసు కృష్ణమోహన్‌ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. వర్గీకరణతో సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణతో ఎస్సీ సామాజిక వర్గాల వారు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలని చెప్పారు. ఆర్థిక, సామాజికంగా వారి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు.

● **మునునూరు:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం చారిత్రాత్మకమని ఉమ్మడి కృష్ణా మాదిగ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తొమ్మండ్రు యువరాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణతో ఉపకులాల వారందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించారు

గంపలగూడెం: పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు సజావుగా నిర్వహించాలని ఎంఈఓ-2 పీవీడీఎల్‌ నరసింహారావు అన్నారు. తోటమూల ఏపీ మోడల్‌ స్కూల్‌లో ఎన్నికల నిర్వహణపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా కమిటీ సభ్యుల నియామకం, చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ ఎన్నికలు జరపాలన్నారు. ఎంఈఓ శ్యామ్‌సుందరరావు, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు మోడల్‌ టెస్ట్‌

ఇబ్రహీంపట్నం: మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌ కలాం ప్రతిభ మోడల్‌ టెస్ట్‌ స్థానిక ప్రతిభ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం ఉదయం నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్‌ వంకా హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం టెన్త్‌క్లాస్‌ చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్‌లో ఏపీఆర్జేసీ, పాలిటెక్నిక్‌, ఐఐటీ, నీట్‌ వంటి ఎంట్రన్స్‌లపై అవగాహన కల్పించి వారిలో పోటీతత్వం పెంపొందించే ఉద్దేశ్యంతో టెస్ట్‌ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు.

నిండు కుండలా తమ్మిలేరు రిజర్వాయర్‌

చాట్రాయి: మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌ ప్రాజెక్టుకు ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలకళ సంతరించుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ద్వారా వచ్చే వరదతోపాటు మండలంలో కురిసే వరదతో రిజర్వాయర్‌ ప్రాజెక్టు నిండు కుండలా ఉంది. 350 అడుగుల నీటి సామర్థ్యం గల ప్రాజెక్టు నుంచి గోనెల వాగు ద్వారా మండలంలోని చాట్రాయి, పోలవరం, మర్లపాలెం గ్రామాల్లో కుడి, ఎడమ కాలువల ద్వారా ఆరు వేల ఎకరాలు, ప్రాజెక్టు నుంచి లింగపాలెం, ధర్మాజీగూడెం గ్రామాల్లోని మూడు వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు తాగు నీరు అందుతుంది. పూర్తి నీటి మట్టం 350 అడుగులు చేరిన తర్వాత మూడు లాకుల ద్వారా నీటిని కిందకు వదులుతారు. ప్రస్తుతం గోలనెల వాగు నీటి మట్టం 349.36 అడుగులు ఉండగా తమ్మిలేరు రిజర్వాయర్‌ ప్రాజెక్టు నీటి మట్టం 349.62 అడుగులు ఉంది. మండలంలోని చిన్నంపేట గ్రామం వద్ద వాగు నుంచి వచ్చే వరద నీటిని కోటపాడు, చిన్నంపేట గ్రామాల్లోని చెరువులకు మళ్లించడంతో చెరువులు నిండిపోయాయి.

తొలగించిన ఆయాలను విధుల్లోకి తీసుకోవాలి

విస్సన్నపేట: స్థానికంగా ఒత్తిళ్ల కారణాలతో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలను పలు ప్రాంతాల్లో తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ అనుబంధ ఆయా సంఘాల జిల్లా కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎన్టీఆర్‌ జిల్లా డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వీఎస్‌ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కలగర హెచ్‌డబ్ల్యూ, నూతిపాడు పాఠశాలలతో పాటు గంపలగూడెం మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆయాలను తొలగించారన్నారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆయాల సంఘం జిల్లా అధ్యక్షుడు చాట్ల పుల్లారావు, రాంబాబు పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు

డీపీఓ శివప్రసాద్‌ యాదవ్‌



జి.కొండూరులో వాటర్‌ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీపీఓ శివప్రసాద్‌ యాదవ్‌

జి.కొండూరు: డ్రెయినేజీలలో మురుగు నీరు నిల్వ లేకుండా పూడికతీత పనులను ముమ్మరం చేయాలని డీపీఓ శివప్రసాద్‌ యాదవ్‌ అన్నారు. వెల్లటూరు, జి.కొండూరు గ్రామాలలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. దోమల లార్వాను నిర్మూలించేందుకు మందులను ఎప్పటికప్పుడు పిచికారీ చేయించాలని సూచించారు. వాటర్‌ ట్యాంకర్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ యూనిట్లను వాడుకలోకి తీసుకొచ్చి కంపోస్టు ఎరువు తయారీపై దృష్టి సారించాలని చెప్పారు. సర్పంచ్‌ మండల అరుణ, సెక్రటరీ బసవలింగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మైలవరం: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చంద్రాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ సునీల్‌ అన్నారు. మైలవరంలోని ఏపీ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించి హాస్టల్‌లోని విద్యార్థినులకు హ్యాండ్‌ వాష్‌, డయేరియా, జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్‌ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్స్‌, హాస్టల్‌ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య సేవలు చిరస్మరణీయం

మైలవరం: భారత దేశ జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య అని, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అప్పారావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య చేసిన వ్యవసాయ పరిశోధనను వివరించారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బి. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా ప్రాముఖ్యతను, అందులోని రంగుల విశిష్టతను తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ అధికారి డాక్టర్‌ శివహరి ప్రసాద్‌, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

● **గంపలగూడెం:** పింగళి వెంకయ్య జయంతిని పెనుగొలను ఎలిమెంటరీ పాఠశాలలో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవా కమిటీ సభ్యులు నారాయణరావు, హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు రంగమ్మ, విద్యార్థులు, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్‌ నగదు అందజేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు లబ్ధిదారులు

గంపలగూడెం: గత రెండు నెలలుగా పింఛన్‌ నగదు పంపిణీలో తమను ఇబ్బందులు పెడుతున్నారంటూ గాదెవారిగూడెంకు చెందిన పలువురు శుక్రవారం మండల పరిషత్‌ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్‌ తీసుకున్న తమకు గడచిన నెల పింఛను ఇవ్వలేదని గాదె ఆదిలక్ష్మి, పి. మల్లేశ్వరి, బుర్రి రత్తయ్య, నంద్యాల వెంకట నరసయ్య, గాదె వీరాస్వామి, బాబు, ఆదినారాయణ, నరసయ్య, నాగరాజు వాపోయారు. ఈనెల కూడా పింఛన్‌ తమకు అందజేయలేదన్నారు. ఎంపీడీఓ చెన్నయ్యకు సమస్యను వివరించారు. దీంతో ఆయన సచివాలయం సిబ్బందిని కార్యాలయానికి పిలిపించి పింఛన్‌ సొమ్ము అందజేయించారు.

విద్యుత్‌ తీగల దొంగలు హల్‌చల్‌

జి.కొండూరు: మొన్న బైకులు, నిన్న పాడి గేదెలు, నేడు విద్యుత్‌ తీగలు చోరీలతో గ్రామీణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జి.కొండూరు మండల పరిధి మునగపాడు గ్రామంలో వరుసగా జరుగుతున్న చోరీలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇదే గ్రామంలో బైకులను చోరీ చేస్తున్న వ్యక్తులను జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఆ వెంటనే గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల రెండు పాడి గేదెలను చోరీ చేసిన ఘటనలో గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన ఏడుగురిని సైతం జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కి తరలించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే పంట పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న బోరుబావి మోటార్ల వద్ద విద్యుత్‌ తీగల చోరీ ఘటనలు కలవర పెడుతుంది. గత కొన్ని రోజులుగా దొంగలు విద్యుత్‌ తీగలను చోరీ చేస్తుండడంతో ఆందోళనకు గురైన రైతులు కొందరు జి.కొండూరు పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. మునగపాడు గ్రామంతో పాటు పక్కనే ఉన్న సున్నంపాడు, చెర్వుమాధవరం గ్రామాలలో సైతం 50కి పైగా మోటార్ల వద్ద విద్యుత్‌ తీగలను కత్తిరించి చోరీ చేసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఒకే గ్రామ పరిధిలో చోరీలు జరుగుతుండటంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వెంటనే స్పందించి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ఎస్‌ఐ రామకృష్ణ



తిరువూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సెబ్‌ సిబ్బంది

విస్సన్నపేట: మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. సైబర్‌ నేరాలపై అప్రమత్తత, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం స్థానిక శ్రీశ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్‌ చేసుకునే సమయంలో, ఉద్యోగ ప్రకటనల పేరుతో వస్తున్న యాప్‌లు, లోన్‌యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీశ్రీ కళాశాల డైరెక్టర్‌ పూర్ణచంద్రారెడ్డి పాల్గొన్నారు.

● గతంలో గంజాయి తాగే అలవాటు ఉన్న వ్యక్తులను గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రామకృష్ణ శుక్రవారం కౌన్సెలింగ్‌ నిర్వహించారు. గంజాయి తాగటం వలన కలిగే అనర్థాలను వివరించారు. గంజాయికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

తిరువూరు: యువకులు మాదకద్రవ్యాలు, గంజాయి వాడకానికి దూరంగా ఉండాలని తిరువూరు స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌ అన్నారు. స్థానిక అక్షర డిగ్రీ కళాశాలలో శుక్రవారం మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలను వివరిస్తూ ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో మెలగాలని, మత్తు పదార్థాలకు బానిసైన వారు సమాజంలో ఛీత్కారానికి గురవుతారని అశోక్‌ వివరించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు.